క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మునెమ్మ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి సోమవారం మండలంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు. మునెమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైఎస్ఆర్ సీపీ నాయకుడు కుట్టి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని కుట్టి కుటుంబ సభ్యులు శాలువాలతో సత్కరించారు. నాయకులు వేల్కూరు బాబు రెడ్డి, ముని రాజారెడ్డి, వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సురేంద్ర రెడ్డి, ఏకాంబరం, గోవింద్ రెడ్డి, వెంకటేశులు రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, ఢిల్లీ, జగదీష్, గోపి, మదన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ట్రైసైకిల్ పంపిణీ


పంచాయతీలకు ట్రైసైకిళ్ల పంపిణీ

నింద్ర: మండలంలోని పలు పంచాయితీలకు చెత్త సేకరణ ట్రైసైకిళ్లను సోమవారం ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ పంపిణీ చేశారు. మండలంలోని నింద్ర, శ్రీరామపురం, కొప్పేడు, అత్తూరు, ఆరూరు గ్రామ పంచాయతీలకు ఈ ట్రైసైకిళ్లను అందజేశారు. చిత్తూరు డీపీఆర్‌సీ సహకారంతో ట్రైసైకిళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీపతి, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన


కార్యదర్శుల శిక్షణా కేంద్రం భవన నిర్మాణానికి స్థల పరిశీలన

గంగాధరనెల్లూరు: పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కేంద్రం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ భార్గవి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని బొమ్మవారిపల్లి బస్టాప్ సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. త్వరలో భవన నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ డీఈ ఆనంద్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఈ సుగుణాకర్‌రావు, సచివాలయ సర్వేయర్ వాసు పలువురు పాల్గొన్నారు.

రీసర్వే సమస్యలు పరిష్కరించండి


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

యాదమరి: గ్రామ సభల్లో భూముల రీసర్వేపై వచ్చిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల తహసీల్దార్ పార్థసారథి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వే సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. గత గ్రామ సభల్లో వచ్చిన 1000 ఫిర్యాదుల్లో ఇప్పటి వరకు 600 వరకు పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని కూడా వెంటనే పరిశీలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేసవి జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: వేసవికాలం దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 50 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఎక్కువగా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగలాంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. వడ దెబ్బకు గురైతే సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

దానధర్మాల మాసం



నింద్ర మసీదులో చిన్నారులకు గంజి పంపిణీ, (ఇన్‌సెట్) నగరి మసీదులో ప్రార్థనలు

- మసీదుల్లో రంజాన్ నమాజులు, దానధర్మాలు
- కఠిన ఉపవాస దీక్షల్లో ముస్లింలు

నగరి/నింద్ర: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. మసీదుల వద్ద ముస్లింలు విరివిగా దానధర్మాలు చేస్తున్నారు. ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. ఈ మాసాన్ని దానధర్మాల మాసంగా చెబుతారు. ఇస్లాం మత బోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా రంజాన్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ మాసం అనంతరం వచ్చే 11 నెలల కాలంలో సన్మార్గంలో జీవించే విధానాన్ని అలవరుస్తోంది. ఈ నెలలో విధిగా చేయవలసిన నమాజ్, రోజా, జకాత్, ఫిత్రా తదితర సత్కార్యాలే కాకుండా, అల్లా ప్రసన్నం కోసం ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్‌లో చెప్పినట్టు చేసే ప్రతి మంచి పనీ దైవారాధన కిందికే వస్తుంది.

70 రెట్ల పుణ్యం వస్తుందని నమ్మకం

రంజాన్ మాసంలో చేసే సత్కార్యాలకు 70 రెట్ల పుణ్యం ఎక్కువగా లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఈ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే రూ.70 దానం చేసినంత పుణ్యం లభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మాసంలో ముస్లింలు అత్యధికంగా దానధర్మాలు చేస్తుంటారు. ఈ మాసంలో నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు చేస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం(సహర్) భుజించి దీక్షను చేపడుతారు. మళ్లీ సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత కొద్దిపాటి ఆహా రాన్ని(ఇఫ్తార్) స్వీకరించి దీక్షను విరమిస్తారు. ఇలా రంజాన్ నెలంతా కఠిన ఉపవాసాలు పాటిస్తారు. ఇస్లాంలో దానధర్మాలు కీలకమైనవి. తమ వద్ద ఉన్న సంపద నుంచి జకాత్ చెల్లిస్తారు. సంపద విలువలో 2.5 శాతం లెక్కించి, వచ్చే సొమ్మును పేదలకు పంచుతారు. బంగారం, వెండి, నగదు ఇలా.. వారి వద్ద ఉన్న వాటిపై నిర్ణీత సొమ్మును జకాత్ తీయడం ద్వారా, మిగిలిన సంపద శుద్ధి అయినట్టు భావిస్తారు. ఇది ముస్లింలు కచ్చితంగా చేపట్టాల్సిన నియమం. ఈ మాసంలో తప్పనిసరిగా పేదలకు ఇవ్వాల్సినది ఫిత్రా(సంతోషాన్ని ఇవ్వడం). రంజాన్ నెలంతా చేసే పుణ్యకార్యాలు, ప్రత్యేక ప్రార్థనలు అల్లా వద్ద ఆమోదం పొందాలంటే, ఈద్ నమాజ్ కన్నా ముందుగా ఫిత్రా కచ్చితంగా చెల్లించాలి. ఇంట్లో ఎంత మంది ఉంటే, అందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలని ముస్లిం పెద్దలు చెబుతున్నారు.

పేద–ధనిక సమానత్వం

రంజాన్ మాసం పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలను చెరిపేస్తుంది. పేద, ధనిక తేడా లేకుండా మసీదుల్లో పక్కపక్కనే నిలబడి నమాజులు చేయడం కనిపిస్తుంది. అందుకే పేదలు కూడా ధనికులతో సమానంగా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో తప్పనిసరి చేశారు. అందుకే ముస్లింలు ఈ మాసంలో ఇతోధికంగా దానధర్మాలు చేస్తూ, ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడరు.

దానంతో పుణ్యఫలం



రంజాన్ మాసంలో దానం చేస్తే పుణ్యం ఎక్కువగా లభిస్తుంది. అర్హుడైన ప్రతి ముస్లిం జకాత్ తప్పనిసరిగా ఇవ్వాలి. తను ఉన్న ఇల్లుకాక, ఇతర మార్గాల్లో వచ్చే ఆదాయం, సంపదలో జకాత్ చెల్లించాలి. పేదలు కూడా ధనికులతో సమానంగా పండగ చేసుకోవడానికి ఈ జకాత్, ఫిత్రా చెల్లించాలి. కుటుంబంలో ఎంత మంది ఉంటే, అందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా చెల్లించాలి.

–మాహిన్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి

అడవిలో కార్చిచ్చు


అడవిలో ఎగసి పడుతున్న అగ్నిజ్వాలలు

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): గుర్తు తెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టిన సంఘటన మండల పరిధిలోని మెదవాడ అటవీ ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... మెదవాడ సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వివధ రకాల జీవులు కాలిపోయాయి. పది సంవత్సరాల క్రితం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో లక్షల రూపాయలు వెచ్చించి వంద హెక్టార్లలో పెంచిన విలువైన ఎర్రచందనం, నీలగిరి చెట్లు దగ్ధమయ్యాయి. వాటి విలువ కోట్లలో ఉంటుంది. ఇంత జరిగినా కనీసం అటవీశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. అటవీశాఖ అధికారులు స్పందించాల్సి ఉంది.

రేపు ఉపాధి హామీ గ్రామసభ

విజయపురం: మండల కేంద్రంలో ఈ నెల 19న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై బహిరంగ గ్రామ సభ ఏర్పాటు చేసినట్లు ఏపీఓ బబిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 25 పంచాయతీలలో జరిగిన పనులపై బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుంది. ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

హమీద్‌ఖాన్‌కు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ


హమీద్‌ఖాన్‌తో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని బాషా బీడీ యజమాని హమీద్‌ఖాన్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సోమవారం హమీద్‌ఖాన్ నివాసానికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం వెంట మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనుంజయవర్మ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, ఉప సర్పంచ్ శేషాద్రి, తౌఫీర్‌ఖాన్, రఫీ, గిరిజ, మోహనమ్మ, సుమతి, మోహనకుమారి, అంబిక, అరుణ, రవిరెడ్డి, శివ ప్రకాష్, శ్రీనివాసులురెడ్డి, దామురెడ్డి, వెంకటరత్నం, రాజ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న అండర్ బ్రిడ్జి చాలా చిన్నదిగా ఉంది. వాహనాలు ప్రయాణించే విధంగా మార్చాలంటే స్థలం కూడా ఆ ప్రాంతంలో లేదని మరో ప్రాంతంలో అండర్‌బ్రిడ్జి నిర్మించి ఇవ్వాలని బీజేపీ నేతలు రైల్వే అధికారులను కోరారు. ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంకు ఉన్న దారిలో అండర్‌బ్రిడ్జి నిర్మిస్తే అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అయితే ఇందుకు మున్సిపల్ అధికారుల అనుమతి కావాలని రైల్వే అధికారులు కోరడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన బీజేపీ నేతలు ఈ విషయం తెలియజేశారు. బీజేపీ ప్రతిపాదిత ప్రాంతాన్ని కమిషనర్ ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలించారు.

టీబీ రోగుల కోసం విరాళం


కలెక్టర్‌కు చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ రవిరాజు

పుత్తూరు: అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్–ఐఎన్‌సీ, యుఎస్‌ఏ సంస్థ వారు ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ పేరిట రూ.1 లక్షను తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు అందజేశారు. ఈ మేరకు సోమవారం పుత్తూరు డాక్టర్ పి.రవిరాజు చేతుల మీదుగా కలెక్టర్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ మార్చి 24వ తేదీన ప్రపంచ టీబీ (క్షయ) దినోత్సవాన్ని పురస్కరించుకొని వంద మంది టీబీ రోగులకు పౌష్టికాహారం(హైప్రొటీన్ డైట్) అందజేయాలని కోరుతూ ఈ మొత్తాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య పనులు


పరిశుభ్రంగా ఉన్న ఉపకేంద్రం గది

సాక్షి ఎఫెక్ట్..

వడమాలపేట (విజయపురం): వడమాలపేట బట్టికండ్రిగ ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. రెండు గదులను శుభ్రం చేసి, మూగజీవాల మల విసర్జన, పిచ్చిమొక్కలను తొలగించారు. 'అపరిశుభ్రంగా ఆరోగ్య ఉపకేంద్రం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి సిబ్బంది ఆరోగ్య ఉపకేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

ఓటరు జాబితాపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

నగరి: ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణపై ఆర్డీఓ భవానీ శంకరి రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితాపై అన్ని పార్టీల వారితో చర్చించారు. దీనిపై పలువురు మాట్లాడుతూ ఓట్లు కొన్ని ప్రాంతాల్లో జిగ్‌జాగ్ అయ్యాయని తెలిపారు. ఒకే ఇంటిలోని ఓట్లు కొన్ని ఒక వార్డులో ఉంటే మరికొన్ని మరో వార్డులో ఉన్నాయన్నారు. అలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని కోరారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఆ తరహా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇలా నెలకోసారి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు భరోసా



నారపరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎంపీపీ జమున భర్తకు పరామర్శ

విజయపురం: అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబాలకు తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. సోమవారం విజయపురం వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన చెన్నకేశవరెడ్డి, కృష్ణయ్య, మంగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎంపీపీ జమున భర్త వెంకటేశ్, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు నారపరాజు, అమ్మనమ్మ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొన్నారు. బాధితురాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శివరాజు, రాష్ట్ర రైతు విభాగ సభ్యుడు గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాలాజీ, సురేష్‌నాయుడు, శేఖర్‌రాజు, సతీష్, కృష్ణయ్య, శ్రీరాములు, భాస్కర్, నాగేష్, జిల్లు, చంద్రయ్య, వెంటకమ్మ, వెంకటేశులు, దేవా, కృష్ణయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పేద కార్మిక వర్గాలకు ఇంటి స్థలాలివ్వాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన

నగరి: విజయపురం మండలం పాతార్కాడులో 85 మంది పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చారని, వారికి వెంటనే ఇంటి స్థలాలు చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అధ్యక్షతన టవర్ క్లాక్ సెంటర్ నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. రామానాయుడు మాట్లాడుతూ అర్హులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం చేసి పేదలకు భూములను పేదలకు పంచుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేసే మున్సిపల్ కార్మికులకు స్వీపర్ కాలనీ ఏర్పాటు చేశారని, నగరిలో ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. వినతిపత్రాన్ని ఆర్డీఓ భవానిశంకరికి అందజేశారు. ఏఐటీయూసీ పట్టణ నాయకులు మురళి, శేఖర్, సిరాజుద్దీన్, రవి, రాజా, బాలసుబ్రమణ్యం, నాగరాజు, చిన్నరాజు, సేటు, రఫీ, మహిళా సంఘం నియోజకవర్గ నాయకులు శ్యామల, రాధా, కవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరు: పట్టణంలోని జెండామాను వీధిలో ఉన్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సోమవారం రాత్రి సంకటహర చతుర్థి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలు సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. బిల్వ పత్రాలు, తెల్లజిల్లేడు పువ్వులు, గరిక పోచలను సమర్పిస్తూ వేయి నామాలతో గణపతిని పూజించారు. బెల్లంతో చేసిన ఉండ్రాళ్లను నివేదించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



ఏకాంబరకుప్పం పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు, పరీక్ష రాసి పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

నగరి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం నగరి మున్సిపల్ పరిధిలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నగరి బాలికల జడ్పీహెచ్‌ఎస్, సత్రవాడ, ఏకాంబరకుప్పం, పుదుపేట జడ్పీహెచ్‌ఎస్‌లు, మండలంలోని తడుకుపేట జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 1130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసులు, వైద్యసిబ్బంది, ప్రత్యేక స్క్వాడ్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. తొలిపరీక్ష కావడంతో ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పిల్లలు పరీక్ష రాసి బయటకు వచ్చేంత వరకు సెంటర్ల సమీపంలో పడిగాపులు కాశారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు పబ్లిక్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్టు చీఫ్ సూపరింటెండెంట్ రాజేంద్రనాయుడు తెలిపారు. 164 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. తహసీల్దార్ అరుణ కుమారి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నింద్ర ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే విద్యార్థులను తనిఖీలు చేసి కేంద్రంలోకి పంపారు. పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మొత్తం168 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరైనట్లు చీఫ్ శ్యామల తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ శేషగిరిరావు పరిశీలించారు.

విజయపురంలో..

విజయపురం: విజయపురం, వడమాలపేట మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడ అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 8గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఫర్నిచర్‌తో పాటు తాగునీరు అందుబాటులో ఉంచారు. విజయపురం మండలంలో మొత్తం 128 మంది, వడమాలపేటలో 204 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసి, పోలీసులు బందోబస్తు కట్టుదిట్టం చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: పదో తరగతి పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ అన్నారు. సోమవారం ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో కత్తెరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, కార్వేటినగరంలో ఆర్కేఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్న పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్వేటినగరంలో 186 మందికి గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజయ్యారు. అలాగే కత్తెరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 244 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా అందులో 242 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): ప్రశాంతంగా పది పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ అరుణాచలంరెడ్డి తెలిపారు. 49 కొత్తపల్లిమిట్ట, శ్రీరంగరాజపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షలకు 399మందికి 396 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. మండల తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎస్‌ఐ సుమన్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.




నింద్ర పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది, వడమాలపేట: పరీక్ష కేంద్రాలకి వెళ్తున్న విద్యార్థులు, పరీక్ష కేంద్రం వద్ద తహసీల్దార్ లోకనాథపిళ్లై

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి



కలెక్టరేట్ వద్ద బాధితుల నిరసన

పుత్తూరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వరమంగళం దళితవాడ, ఆదిఆంధ్రవాడకు చెందిన 40 కుటుంబాల వారు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయారని తెలిపారు. వీరికి వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో బాధితులు కిరణ్, అయ్యప్ప, హరి, రాజేంద్రన్, బాబు, మధు, యుగంధర్, మనోజ్, శేషాద్రి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.